సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం ǀ 14 ǀ ఆగస్టు ǀ 2024



..మలేరియాకు చెక్

మలేరియా వ్యాప్తికి కారణమయ్యే దోమల లార్వాల నిర్మూలనకు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో గంబూషియా చేపలు వదులుతున్నారు. 8లో



ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

ఛత్తీస్‌గఢ్‌లో మావోలు - పోలీసుల నడుమ ఎదురుకాల్పులు జరగగా ఘటనాస్థలి నుంచి డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 24°

వాతావరణం

జిల్లాలో బుధవారం చాలాచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశముంది.

ఆ మూడు అయితేనే!



అన్నపురెడ్డి మండలం కట్టుగూడెం హైవే వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి

రేపు 'సీతారామ' మోటార్లు స్విచ్ఛాన్ చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి

- ఇంకా సిద్ధం కాని పంప్‌హౌస్ - 3
- ఎన్‌హెచ్-30పై అసంపూర్తిగానే వంతెన నిర్మాణం
- ఏన్కూరు వద్ద కొలిక్కిరాని గ్యాస్ పైప్‌లైన్ అంశం
- సాగర్ ఆయకట్టుకు కృష్ణా జలాలు రావడంతో ఆందోళన లేదంటున్న ప్రభుత్వవర్గాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు పంద్రాగస్టు నాటికి అందించాలనే లక్ష్యంతో గడిచిన రెండు నెలలుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు దృష్టి సారించారు. ఆ దిశగా అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. రెండు పంప్ హౌస్‌ల్లో ట్రయల్ రన్ కూడా పూర్తి కాగా.. గురువారం మోటార్లు స్విచ్ఛాన్ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారు. అయితే, ప్రాజెక్టులో కీలకమైన మూడు పనులు మాత్రం పూర్తి కాక పోవడంతో ఉత్కంఠ నెలకొంది.

గ్యాస్ పైప్‌లైన్

గోదావరి జలాలు రాజీవ్ కెనాల్‌కు చేరడానికి మరో ప్రధాన అడ్డంకిగా ఏన్కూరు మండలంలో గ్యాస్ పైప్‌లైన్ ఉంది. గ్యాస్‌పైప్ ఉన్న చోట ప్రధాన కాల్వ నిర్మాణం ఎలా చేపట్టాలనే అంశంపై ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు పైప్‌లైన్ ఏర్పాటు చేసిన గుజరాత్ ప్రభుత్వానికి మధ్య పలు దఫాలు చర్చలు జరిగాయి. ముందుగా సిద్ధం చేసిన డిజైన్‌పై గుజరాత్ ప్రభుత్వం అభ్యంతరం చెప్పింది. తప్పనిసరి బాక్స్ డ్రెయిన్ డిజైన్ కావాలని పట్టుబట్టింది. దీంతో ప్రతిపాదనల్లో మార్పు చేసి పనులు చేపట్టారు. సీతారామ ప్రారంభోత్సవానికి ఇంకా ఒకే రోజు సమయం ఉండగా ఈ పని పూర్తికావడం కష్టమనే అభిప్రాయం నెలకొంది.

అయినా హైరానా అక్కర్లేదు..

గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా నాగార్జునసాగర్ ఆయకట్టుకు నీరు అందలేదు. దీంతో ఈ ఏడాది ఆ తరహా పరిస్థితి రావొద్దనే లక్ష్యంతో రాజీవ్ కెనాల్ నిర్మాణం చేపట్టడమే కాక మూడు పంప్‌హౌస్‌లు, ప్రధాన కాల్వ నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం వేగిరం చేసింది. ఈసారి కృష్ణా నదికి వరద రావడంతో ఎన్ఎస్‌పీ ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందే అవకాశముంది. దీంతో ఇప్పటికిప్పుడు గోదావరి జలాలను రాజీవ్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు మళ్లించాల్సిన అవసరం తప్పింది. ఫలితంగా పంప్‌హౌజ్-3, ఎన్‌హెచ్-30పై వంతెన, గ్యాస్‌పైప్ లైన్ పనులు పూర్తి కాకపోయినా పెద్దగా హైరానా పడాల్సిన పని లేదనే అభిప్రాయం ప్రభుత్వ వర్గాల్లో ఉంది. అయితే షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేస్తే అత్యవసర పరిస్థితుల్లో కృష్ణా ఆయకట్టుకు గోదావరి జలాలు చేరతాయని మరికొందరు అభిప్రాయపడుతున్నారు.

మూడో పంప్‌హౌస్-3లో ఎత్తిపోసిన నీరు 54 కి.మీ. ప్రయాణించి జూలురుపాడు సమీపాన 102 కి.మీ. వద్ద రాజీవ్ కెనాల్‌కు చేరతాయి. అయితే మార్గమధ్యలో అన్నపురెడ్డిపల్లి మండలం కట్టుగూడెం దగ్గర ప్రధాన కాల్వ, విజయవాడ - జగదల్‌పూర్ జాతీయ రహదారి(ఎన్‌హెచ్ -30) కలుస్తున్నాయి. దీంతో ఇక్కడ వంతెన నిర్మాణం కోసం ఆగమేఘాలపై అనుమతులు సాధించి పనులు చేపడుతున్నారు. శరవేగంగా పనులు చేయడంతో చివరి దశ వరకు వచ్చినా పూర్తి కాలేదు. దీంతో ప్రధాన కాల్వలోకి వచ్చిన గోదావరి జలాలు ఈ రోడ్డును దాటుకుని వెళ్లడం కష్టమే. వంతెన పనులు పూర్తికాకపోయినా జలాలను దిగువ భాగానికి పంపేందుకు వీలుగా తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నామని ఇరిగేషన్ అధికారులు అంటున్నారు.

పంప్‌హౌజ్ - 3

సీతారామ ప్రధాన కాల్వ వెంట 102 కి.మీ. దగ్గర కొత్తగా రాజీవ్ కెనాల్‌ను ప్రతిపాదించి గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా జూన్ చివరి నాటికి అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో ఉన్న పంప్‌హౌజ్ -1లో ట్రయల్ రన్ పూర్తిచేశారు. ఆ తర్వాత ఇంజనీర్లు శ్రమించి రెండు, మూడు పంప్‌హౌస్‌ల్లో మోటార్లను సిద్ధం చేశారు. దీంతో ఈనెల 12న ములకలపల్లి మండలం పూసుగూడెంలోని పంప్‌హౌస్ -2, కమలాపురం పంప్‌హౌస్ -3కు ట్రయల్ రన్ చేపట్టాలని భావించారు. అయితే సాంకేతిక కారణాలతో ఆ రోజు కేవలం పంప్‌హౌస్-2 ట్రయల్ రన్ జరిగింది. అప్పటి నుంచి మంగళవారం సాయంత్రం వరకు కూడా పంప్‌హౌస్-2లో మోటార్లకు టెస్ట్ రన్ చేపట్టేందుకు అధికారులు శ్రమిస్తున్నా పనులు ఓ పట్టాన కొలిక్కి రావడం లేదు. మరోపక్క ఇంజనీరింగ్ అధికారులు మాత్రం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభోత్సవం చేసే సమయానికి మూడో పంప్‌హౌస్ సిద్ధం చేస్తామని చెబుతున్నారు.



ములకలపల్లి మండలం కమలాపురంలోని పంప్‌హౌస్-3

తొలుత 'సీతారామ' మోటార్ల స్విచ్ఛాన్

- అక్కడి నుంచి వైరా సభకు హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ముఖ్యమంత్రి టూర్ షెడ్యూల్ ఖరారు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లా పర్యటన ఖరారైంది. ఈనెల 15న హైదరాబాద్‌లో జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం హెలీకాప్టర్‌లో ఆయన ఇక్కడకు వస్తారు. ఈమేరకు సీఎం నాలుగు గంటల పాటు జిల్లాలో గడపనుండగా సీఎంఓ నుంచి షెడ్యూల్ విడుదలైంది.

షెడ్యూల్ ఇలా..

- మధ్యాహ్నం 12-50 గంటలకు ములకలపల్లి మండలం పూసుగూడెంకు హెలీకాప్టర్‌లో చేరుకుంటారు.
- 12-55కు పూసుగూడెంలో సీతారామ ప్రాజెక్ట్ పంపుహౌస్ వద్ద పైలాన్ ఆవిష్కరించి పంప్‌హౌస్ మోటార్లను స్విచ్ఛాన్ చేస్తారు. ఆతర్వాత గోదావరి జలాలకు పూజ చేయడంతో పాటు విలేకరుల సమావేశంలో మాట్లాడతారు.
- మధ్యాహ్నం 2-15గంటలకు అక్కడి నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 2-45 గంటలకు వైరా చేరుకుంటారు.
- మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 4-30 గంటల వరకు వైరా బహిరంగ సభలో మాట్లాడతారు. ఇక్కడే రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షల వరకు రుణమాఫీ చెక్కులు అందజేశాక 4-45 గంటలకు హెలీకాప్టర్‌లో హైదరాబాద్ బయలుదేరతారు.

ఒక్కొక్కరు ఒక్కో పంప్‌హౌస్!

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీతారామ ప్రాజెక్టులో భాగమైన ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద పంప్‌హౌస్-2ను సీఎం రేవంత్ రెడ్డి గురువారం ప్రారంభించనున్నారు. అదే సమయానికి ఎగువన అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులోని పంప్‌హౌస్-1ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో, ములకలపల్లి మండలం కమలాపురంలోని పంప్‌హౌస్-3ను ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. అయితే, దీనికి సంబంధించి అధికార ప్రకటన మాత్రం వెలువడలేదు.

ఫైలాన్ సిద్ధం..

ములకలపల్లి: ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్-2లో సీఎం రేవంత్‌రెడ్డి గురువారం మోటార్లు స్విచాన్ చేయనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు మంగళవారం పంప్‌హౌస్‌ను పరిశీలించి ఏర్పాట్లపై సూచనలు చేశారు. అలాగే, పైలాన్ నిర్మాణం మొదలుపెట్టగా, మోటార్లు, డెలివరీ పంపులకు రంగులు వేస్తున్నారు. అంతేకాక గతంలో ఉన్న హెలీప్యాడ్‌కు తోడు మరొకటి నిర్మిస్తున్నారు. ఇందుకోసం అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగలను తొలగించారు. అలాగే, సీఎం మోటార్లు ఆరంభించనున్న నేపథ్యాన అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులోని పంప్‌హౌస్ -1 వద్ద నీరు విడుదల చేసి ఇక్కడ నిల్వ చేశారు. కాగా, బందోబస్తును డీఎస్పీ సతీశ్ నేతృత్వాన పర్యవేక్షిస్తున్నారు.



పంప్‌హౌస్ -2 వద్ద నిర్మిస్తున్న పైలాన్



కాల్వలోకి భారీగా చేరిన గోదావరి జలాలు

న్యూస్‌రీల్

జెండా ఎగురవేయనున్న మంత్రి తుమ్మల

ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టి, వరంగల్‌లో పొంగులేటి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలో గురువారం జరిగే వేడుకల్లో ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ జెండా ఎగురవేస్తారు. పంద్రాగస్టు సందర్భంగా జిల్లాల్లో జాతీయ జెండాలు ఎగురవేసే మంత్రుల వివరాలను ప్రభుత్వం ప్రకటించింది. ఖమ్మంలో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క జాతీయ జెండా ఆవిష్కరించనుండగా.. వరంగల్‌లో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జెండా ఎగురవేస్తారు.

కనులపండువగా కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి వారి నిత్యకల్యాణం వేడుకగాసాగింది. తెల్లవారుజామునే గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. ఆతర్వాత బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం జరిపించి స్వామికి కంకణధారణ, యజ్ఞోపవేత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్ర ధారణ గావించారు. ఆపై నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఇక మంగళవారం కావడంతో శ్రీ అభయాంజనేయస్వామి ఉపాలయంలో ప్రత్యేక అభిషేకం చేశారు.

16న వరలక్ష్మి వ్రతం

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామివారి ఆలయంలో ఈనెల 16న శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ఈఓ బి.రమాదేవి తెలిపారు. ఆలయంలోని బేడా మండపం వద్ద జరిగే వ్రతంలో భాగంగా సామూహిక కుంకుమార్చన ఉంటుందని, భక్తులు రూ.200 చెల్లించి పూజలో పాల్గొనాలని సూచించారు. కాగా, ఈనెల 15 నుంచి 19వరకు పవిత్రోత్సవాల సందర్భంగా నిత్య కల్యాణ వేడుక రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, శ్రావణమాసం నాలుగో శుక్రవారం 30వ తేదీన సాయంత్రం 4నుంచి 5 గంటల వరకు శ్రీలక్ష్మీతాయారు అమ్మవారికి పుష్పాంజలి ఉంటుందని ఈఓ వెల్లడించారు.

పోస్టల్ పథకాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వీరభద్రస్వామి

అశ్వారావుపేటరూరల్: పోస్టల్ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరిండెంటెంట్ వి.వీరభద్రస్వామి సూచించారు. మండలంలోని నారంవారిగూడెం పోస్టల్ బ్రాంచ్ కార్యాలయం వద్ద మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తపాలా శాఖ ద్వారా బ్యాంకింగ్ సేవలతోపాటు చిన్న మొత్తాల పొదుపు, సేవింగ్ ఖాతాలు, పీపీఎఫ్, టీడీ, బీమా పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏటా రూ.520 ప్రీమియంతో రూ.10లక్షలు, రూ.755 తో రూ.15లక్ష బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ బి.రమేష్‌నాయక్, ఉద్యోగులు సాయి, బి.శేషుకుమార్, దుర్వాసరావు, పి.రామారావు, పంచాయతీ కార్యదర్శి బిట్టా వెంకటేశ్వర్లు, సీసీ అపర్ణ, గ్రామ దీపికలు దాసరి రేవతి, కె. కృష్ణకుమారి పాల్గొన్నారు.

రెండో నోటిఫికేషన్ 'కీ' విడుదల

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో రెండో దఫా విడుదల చేసిన ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్‌కు సంబంధించి పరీక్ష కీని మంగళవారం విడుదల చేశారు. అయితే, ఈ కీని బయటకు వెల్లడించకుండా అభ్యర్థుల సెల్‌నంబర్‌కు పాస్‌వర్డ్ పంపించారని, దాని ద్వారా ఫలితాలు చూసుకునే అవకాశం కల్పించినట్లు సమాచారం. రెండో నోటిఫికేషన్‌ను 327 పోస్టుల భర్తీకి జారీ చేయగా 35 వేల మందిలో 29,291 మంది ఈనెల 6, 7వ తేదీల్లో నిర్వహించిన పరీక్షకు హాజరయ్యారు. ఆయా అభ్యర్థులకు ఎడ్‌సెల్ సంస్థ కీతో పాటు ఆన్సర్‌షీట్ చూసుకునే అవకాశం కల్పించింది. తద్వారా తమకు ఎన్ని మార్కులు వస్తాయో తెలుసుకోవడమే కాక కీలో తప్పులు ఉన్నా అభ్యంతరం తెలపాల్సి ఉంటుంది. అభ్యంతరాల స్వీకరణ అనంతరం పరిశీలించి ఫైల్ కీ విడుదల చేయనున్నారు.

శ్రీనన్న ఎక్కడా అని అడవి అడుగుతోంది..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ, పక్కన సీసీఎఫ్ భీమానాయక్, అధికారులు

- రేంజర్ శ్రీనివాసరావు పేరిట స్మృతివనం ఏర్పాటు హర్షణీయం
- రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుదాం
- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

చంద్రుగొండ: అటవీ రక్షణ కోసం నిరంతరం కృషి చేసిన రేంజర్ శ్రీనివాసరావు(శ్రీనన్న) ఎక్కడ ఉన్నాడని అడవి అడుగుతోందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని కనకగిరి అటవీ ప్రాంతంలో రేంజర్ శ్రీనివాసరావు విధినిర్వహణలో అసువులు బాసిన చోట ఆయన పేరిట స్మృతివనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమానాయక్ మంగళవారం పనులను ప్రారంభించగా శ్రీనివాసరావు సతీమణి భాగ్యలక్ష్మి తదితరులు మొక్కలు నాటారు. ఈమేరకు అడవుల సంరక్షణలో రేంజర్ శ్రీనివాసరావు అంకితభావంపై ఎమ్మెల్యే పాట ఆలపించారు. ఆతర్వాత ఆయన మాట్లాడుతూ స్మృతివనాన్ని రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దాలని అధికారులను కోరారు. కాగా, శ్రీనివాసరావు కుటుంబానికి ఇప్పటికే రూ.50 లక్షలు ఆర్థికసాయం, ఆయన భార్యకు ఉద్యోగం ఇవ్వగా.. త్వరలోనే ఖమ్మంలో 500 గజాల ఇంటిస్థలం ఇవ్వనున్నట్లు తెలిపారు.

మొక్కలు నాటడమే నిజమైన నివాళి

గొత్తికోయల చేతిలో రేంజర్ శ్రీనివాసరావు హత్యకు గురవడం బాధాకరమని సీసీఎఫ్ భీమానాయక్ అన్నారు. అటవీ సంపదను కాపాడడమే లక్ష్యంగా పనిచేసిన ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. ఏటా ఇక్కడ అధికారులకు శిక్షణ ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి కిష్టాగౌడ్, వివిధ జిల్లాల అటవీ శాఖ ఉద్యోగులు అనూష్ అగర్వాల్, విశాల్, రేవంత్‌చంద్ర, సందీప్‌రెడ్డి, కోటేశ్వరరావుతో పాటు సీఐ ఇంద్రసేనారెడ్డి, చంద్రుగొండ తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ అశోక్, ఎస్ఐ స్వప్న, మాజీ జెట్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనకగిరి గుట్టల అభివృద్ధికి రూ.600 కోట్లు

భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో విస్తరించి ఉన్న కనకగిరి గుట్టల ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రూ.600 కోట్లు నిధులు మంజూరయ్యాయని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమానాయక్ వెల్లడించారు. రేంజర్ శ్రీనివాసరావు స్మృతివనంలో ఆయన మాట్లాడుతూ శ్రీనివాసరావు స్మారకార్థం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. ఇందుకోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం శుభపరిణామని తెలిపారు. చంద్రుగొండ, వీఎం బంజర, కల్లూరు, తల్లాడ, జూలూరుపాడు మండలాల్లో విస్తరించి ఉన్న కనకగిరి గుట్టలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చేయనున్న పనుల వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొన్నారు.

చకచకా ఏర్పాట్లు..

- రేపు వైరా రైతు సదస్సుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఇక్కడే రూ.2లక్షల రుణమాఫీ చెక్కుల పంపిణీ
- ఏర్పాట్లపై డిప్యూటీ సీఎం, మంత్రులు తుమ్మల, పొంగులేటి పరిశీలన
- పర్యవేక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులు



వైరాలో జర్మన్ హ్యాంగర్లతో సిద్ధం చేసిన సభావేదిక

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లాలో ఈనెల 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెంలో సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌లో మోటార్లను సీఎం ఆన్ చేస్తారు. ఆతర్వాత వైరా చేరుకుని రైతు రుణమాఫీ సదస్సులో ప్రసంగించనున్నారు. అలాగే, రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షలలోపు రుణమాఫీకి సంబంధించి కొందరు రైతులకు చెక్కులు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు రైతులను ఆకట్టుకునేలా ఇక్కడ స్టాళ్లు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతిష్టాత్మకంగా సభ

గోదావరి జలాలను ఉమ్మడి జిల్లా సాగుభూములకు అందించేలా తలపెట్టిన సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌లను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టు పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతుండగా ఏన్కూరు లింక్ కెనాల్(రాజీవ్ కెనాల్) పనులు చివరి దశకు చేరుకున్నాయి. సీఎం గురువారం ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద పంపుహౌస్ మోటార్లను ఆన్ చేయనున్నారు. అక్కడి నుంచి వైరాలో ఏర్పాటు చేసిన రైతు సదస్సుకు సీఎం చేరుకుంటారు. ఈ సదస్సును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోగా.. తమది రైతు ప్రభుత్వమనే సందేశం ఇవ్వాలనే లక్ష్యంతో మంత్రులు పర్యవేక్షిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరచుగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తుండగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ నిరంతరం పరిశీలిస్తున్నారు.

భారీగా ఏర్పాట్లు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాకు రావడం ఇది రెండోసారి. రాష్ట్రవ్యాప్తంగా మూడో విడత రుణమాఫీకి సంబంధించి చెక్కుల పంపిణీ ఇక్కడే చేయనుండడం.. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్ మోటార్లకు ముఖ్యమంత్రి స్విచ్ఛాన్ చేయనున్న నేపథ్యాన ఏర్పాట్లు భారీగా చేస్తున్నారు. వైరాలో 200 మంది కూర్చునేలా వేదిక నిర్మాణం చేపట్టారు. అంతేకాకుండా సభకు హాజరైన వారు ఎక్కడ కూర్చున్నా వీక్షించేలా 26 స్క్రీన్లు అమర్చారు. వ్యవసాయశాఖకు సంబంధించి పది, ఇతర శాఖలవి ఇరవై కలిపి మొత్తం 30స్టాళ్లు ఏర్పాటవుతున్నాయి. ఇక కళాకారుల కోసం మరో వేదిక ఏర్పాటుచేశారు. అంతేకాక సీఎం విశ్రాంతి తీసుకోవడానికి ఒకటి, మంత్రుల కోసం మరో గ్రీన్‌రూమ్ సిద్ధమయ్యాయి. సభ నిర్వహణకు 15 ఎకరాల స్థలాన్ని గుర్తించగా ఎండ, వానకు ఇబ్బంది పడకుండా జర్మనీ పరిజ్ఞానం (జర్మన్ హ్యాంగర్స్)తో కూడిన షెడ్లు వేశారు. సభకు వచ్చిన వారు కూర్చునేలా కుర్చీలు వేయిస్తుండడంతో పాటు మజ్జిగ, తాగునీరు సమకూర్చనున్నారు.

జోరుగా ప్రచారం

వైరాలో జరిగే సభకు భారీగా జనం, రైతులను తరలించేలా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కొన్నిరోజులుగా విస్తృత ప్రచారం చేస్తున్నారు. కళాకారులు వైరాలో ప్రచారం చేయగా.. నాయకులు ముఖ్యకార్యకర్తలతో సమావేశమై జనసమీకరణకు సూచనలు చేశారు. సభకు 50 వేల మంది జనాన్ని సమీకరించాలని నిర్ణయించారు. కాగా, సభ ఏర్పాట్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరిశీలించారు.

రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణకు అనుమతించండి

రైల్వే జీఎంతో ఎంపీ రఘురాంరెడ్డి భేటీ



జీఎంతో మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

కొత్తగూడెంఅర్బన్: రైల్వే పరిధిలోని సమస్యలు పరిష్కరించి అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కోరారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జీఎంతో భేటీ అయిన ఎంపీ మాట్లాడారు. కొత్తగూడెం సమీప గ్రామాలను అనుసంధానించేలా రోడ్డు రైల్వేస్టేషన్ సమీపాన ఇరుకుగా ఉన్నందున విస్తరణ కోసం రైల్వేశాఖ స్థలాన్ని కేటాయించాలని సూచించారు. అలాగే, కోవిడ్ సమయాన నిలిపేసిన రైళ్లన్నీ పునరుద్ధరించాలని కోరారు. అంతేకాక సికింద్రాబాద్ - భద్రాచలం రోడ్డు రైలును మణుగూరు వరకు పొడిగించాలని కోరగా జీఎం సానుకూలంగా స్పందించారని ఎంపీ తెలిపారు.

400 మంది గిరిజన యువతకు ఉద్యోగాలు

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో పలు ప్రైవేట్ సంస్థల్లో 400 మంది యువతకు ఉద్యోగావకాశాలు దక్కాయని పీఓ బి.రాహుల్ తెలిపారు. ఐటీడీఏ ప్రాంగణంలో నిర్వహించిన జాబ్‌మేళా పూర్తయ్యాక ఆయన ఉద్యోగాలకు ఎంపికైన యువతీ, యువకులకు నియామకపత్రాలు అందజేసి మాట్లాడారు. జాబ్‌మేళాకు 19 ప్రైవేట్ కంపెనీల బాధ్యులు హాజరుకాగా 1,200 మంది యువత హాజరయ్యారని తెలిపారు. వీరిలో 400 మంది ఉద్యోగాలను సాధించటం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.



యువతికి నియామక పత్రం అందజేస్తున్న పీఓ రాహుల్

మహిళలు స్వశక్తితో ఎదగాలి

గిరిజన మహిళలు స్వశక్తి, స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని గిరిజన భవనంలో చిన్న తరహా పరిశ్రమలు, యూనిట్లు ఏర్పాటుచేసిన గిరిజన మహిళలు ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ఆదివాసీ మహిళలు నాప్‌కిన్లు, మిల్లెట్ బిస్కెట్లు, కొర్రలతో తయారు చేసే బిస్మిల్లా బాత్, రాగి, జొన్న జావ తయారుచేస్తుండడం అభినందనీయమన్నారు. వీటి అమ్మకాలకు ఐటీడీఏలో కౌంటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమాల్లో ఏపీఓ డేవిడ్‌రాజ్, మేనేజర్ ఆదినారాయణ, జేడీఎం హరికృష్ణ, మహిళా సంఘాల సభ్యులు వెంకటలక్ష్మి, లలిత,సమ్మక్క, మంగ వేణి, నాగ ప్రమీల, చుక్కమ్మ, రూప పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇల్లెందుకు సైతం నీరు అందించండి..



మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇల్లెందు: సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా తొలుత ఉన్న రోళ్లపాడు ప్రాజెక్టును రద్దు చేసి రీడిజైన్ చేసిన నేపథ్యాన ఇల్లెందు నియోజకవర్గానికి అన్యాయం జరగకుండా చూడాలని అఖిలపక్షం నాయకులు కోరారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆధ్వర్యాన మంగళవారం ఖమ్మంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇల్లెందు నియోజకవర్గం, మహబూబాబాద్ జిల్లాకు తీరని అన్యాయం జరుగుతోందని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి స్పందిస్తూ పాత డిజైన్ ప్రకారం అటవీ అనుమతులు ఆటంకంగా మారగా.. నూతన డిజైన్ ప్రకారం భవిష్యత్‌లో అన్ని ప్రాంతాలకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ విషయాన్ని గుర్తించి అభివృద్ధిని అడ్డుకోవద్దని సూచించారు. అంతేకాక ఏనాడూ స్వలాభం కోసం పనిచేయని తనపై అసత్య ప్రచారం మానేయాలని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు ఏపూరి బ్రహ్మం, ఆలేటి కిరణ్, రాంసింగ్, నూతలపాటి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా పదోన్నతి

ఖమ్మంక్రైం: ఉమ్మడి జిల్లాకు చెందిన ఎనిమిది మంది హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా పదోన్నతి లభించింది. ఈ విషయమై ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందిన వారిలో బస్వానారాయణ (1994), వెంకటకృష్ణ (428), సూర్యచందర్‌రావు (384), సహదేవ్ (1679), నాగరాజు(1948), రామిరెడ్డి (797), చంద్రకశాధర్‌రావు (567), లక్ష్మణ్‌చౌదరి (302) ఉన్నారు. వీరికి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

టీజీ గ్రీన్ రేంజర్ కోఆర్డినేటర్‌గా పాషా



మహమూద్‌పాషా

గుండాల: ఆళ్లపల్లి మండలం జాకారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం షేక్ మహమూద్ పాషా ప్రపంచ పర్యావరణ సంస్థలో తెలంగాణ రాష్ట్ర గ్రీన్ రేంజర్ కోఆర్డినేటర్‌గా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. తనను నియమించిన డబ్ల్యూఈఓ ఫౌండర్ భద్ర, ప్రధాన కార్యదర్శి నిఖిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యాసంస్థల్లో పర్యావరణంపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.


కుంగ్ ఫూ పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్‌లు

కొత్తగూడెంటౌన్: జాతీయస్థాయి కుంగ్ ఫూ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఈ నెల 11న విజయవాడలో జరిగిన పోటీల్లో ఐదు రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుంగ్ ఫూ కటాస్ విభాగంలో జిల్లాకు చెందిన పి.ప్రవీణ్‌కుమార్, జి.అలేఖ్య, బి.యువన్ తేజ బంగారు పతకాలు, బి.ప్రణతి, బి.సాత్విక్ వెండి పతకాలను సాధించారు. వీరిని కోచ్‌లు బి.సాగర్, ఆదినారాయణ తదితరులు మంగళవారం అభినందించారు.

గోవులకు రేడియం బెల్ట్‌లు



రేడియం బెల్ట్‌లు వేస్తున్న తహసీల్దార్

మణుగూరుటౌన్: పట్టణంలోని ప్రధాన రహదారిపై రాత్రివేళ గోవులు సంచరిస్తుండగా భారీ వాహనాల రాకపోకలతో ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ క్రమంలో తహసీల్దార్ రాఘవరెడ్డి వీటిని బయటకు వదలొద్దని పలుమార్లు యజమానులను హెచ్చరించినా పరిస్థితిలో మార్పు రాలేదు. దీంతో చీకట్లో కూడా గోవులు కనిపించేలా వాటి మెడకు మంగళవారం రేడియం బెల్ట్‌లు వేయించగా పలువురు తహసీల్దార్‌ను అభినందించారు.

నాటుసారా పట్టివేత

దుమ్ముగూడెం: మండలంలోని తాటివారిగూడెం, చిన్ననల్లబెల్లి, చిన్నబండిరేవు, సీ తానగరం, గోవిందాపురం గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిని తహసీల్దార్ అశోక్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. ఎక్సైజ్ ఎస్‌ఐ అల్లూరి సీతారామరాజు, హెడ్ కానిస్టేబుల్ హలీం, కానిస్టేబుళ్లు వీరబాబు, రాకేశ్, మనోహర్, వెంకట్ పాల్గొన్నారు.

గంబూషియాతో మలేరియాకు చెక్

- దోమల లార్వాను తినేయనున్న చేప
- నీటి నిల్వలు, నీరు పారే ప్రాంతాల్లో వదులుతున్న అధికారులు
- జిల్లాలో ఇప్పటి వరకు 59 మలేరియా కేసులు నమోదు



గంబూషియా చేపలు, ఆయిల్ బాల్స్ వదులుతున్న వైద్య సిబ్బంది

భద్రాచలంఅర్బన్: ప్రజలను పట్టిపీడిస్తున్న మలేరియా వ్యాధికి చెక్ పెట్టేందుకు వైద్య, ఆరోగ్యశాఖ చర్యలకు ఉపక్రమించింది. మలేరియా బారిన పడి ఏటా పలువురు మృత్యువాత పడుతున్నారు. మైదాన ప్రాంతంతో పాటు గిరిజన ప్రాంతాల్లోనూ మలేరియా కేసులు నమోదవుతున్నాయి. ఈ వ్యాధికి కారణమైన దోమలు వృద్ధి చెందకుండా మొగ్గలోనే తుంచేసేందుకు గంబూషియా చేపలను వైద్యాధికారులు వినియోగించనున్నారు. నీరు పారే ప్రాంతాల్లోనే కాక నీరు నిల్వ ఉన్న చోట ఈ చేపలు వదులుతారు. మలేరియాను వ్యాప్తి చేసే అనాఫిలిస్ దోమలకు చెందిన లార్వాలను గంబూషియా చేప తినేస్తుంది. తద్వారా దోమల వృద్ధి ఆగిపోయి వ్యాధి వ్యాప్తి సైతం తగ్గుముఖం పడుతుందని చెబుతున్నారు.

2.50 లక్షల చేపలు

జిల్లాలోని పలు గ్రామాల్లో నీరు నిల్వఉన్న ప్రాంతాల్లో 2.50 లక్షల గంబూషియా చేపలను వైద్యాధికారులు వదలనున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే 82 వేల గంబూషియా ఫిష్‌లను వివిధ పీహెచ్‌సీలకు అందజేశారు. కాగా, జిల్లాల్లో ఇప్పటి వరకు 59 మలేరియా కేసులు నమోదైనందున వీటి సంఖ్య మరింత పెరగకుండా అధికారులు దృష్టి సారించారు. ఇదేకాక ఆరు బయట స్థలాలు, కుంటలు, మురికినీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో టిమోఫాస్ క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తున్నారు. జిల్లాకు అవసరమైన మందు చేరుకోగా.. భద్రాద్రి జిల్లా మలేరియా నివారణ అధికారి, అసిస్టెంట్ మలేరియా అధికారి ఆధ్వర్యాన పనులు చేయిస్తున్నారు.

దోమలకు చెక్ పెట్టేలా..

డెంగీ, మలేరియా కారక దోమలను అంతమొందించేందుకు మలేరియా విభాగం ఆధ్వర్యంలో విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందుకోసం గంబూషియా చేపలను మత్స్యశాఖ నుంచి సేకరించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు వైద్యాధికారులు 82 వేల చేపలను విడుదల చేయగా మధ్యలో భారీ వర్షాలతో కాస్త విరామం వచ్చింది. ఈ చేపల జీవితకాలం నాలుగు నుంచి ఐదేళ్లు ఉండగా.. స్వచ్ఛమైన నీరు కలిగిన స్విమ్మింగ్ పూల్స్, మంచి నీటి చెరువులు, బావులు, ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో పెరుగుతూ దోమల లార్వాలు, పీచు తిని జీవిస్తాయి. ఆడ చేప 5.2 నుంచి 6.8 సెం.మీ. వరకు, మగ చేప 4.5 సెం.మీ వరకు పెరుగుతుంది. ఒక్కో చేప రోజుకు 100 నుంచి 300 దోమల లార్వాలను తినేస్తుంది. ఆడచేపలు విడతకు 20 నుంచి 30 పిల్లలకు (ఇవి గుడ్లు పెట్టవు) జన్మనిస్తాయి. తమ జీవితకాలంలో ఒక్కో చేప 900నుంచి 1200ల పిల్లలకు జన్మనివ్వనుండటంతో దోమల లార్వాలను తుదముట్టించొచ్చని అధికారులు భావిస్తున్నారు.

ఈ జాగ్రత్తలూ తప్పనిసరి

వైద్య, ఆరోగ్యశాఖ చేపట్టే చర్యలకు తోడు ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చేయాలి. నీరు నిల్వ ఉండే పాత్రలను తరచుగా శుభ్రం చేసుకోవాలి. బావులు, పూడ్చలేని కందకాల్లో దోమ లార్వాలను తినే గంబూషియా చేపలను వదిలితే ఫలితం ఉంటుంది. అలాగే, సాయంత్రం వేళ వేపాకు పొగ వేసినా దోమలు దూరమవుతాయి. అంతేకాక అనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవడమే మేలని చెబుతున్నారు. తీవ్రమైన చలిజ్వరం, రోజు విడిచి రోజు జ్వరం రావడం, తీవ్రమైన తలనొప్పి మలేరియా వ్యాధి లక్షణాలుగా గుర్తించి పరీక్ష చేయించుకోవాలి.

చేపలు వదులుతున్నాం..



మలేరియాను తుదముట్టించేలా గంబూషియా ఫిష్‌ను వదులుతున్నాం. ఇప్పటికే 82 వేల చేపలను నీరు పారే కాలువలు, చెరువుల్లో వదిలాం. మిగిలిన వాటిని కూడా మరో పది రోజుల్లో వదులుతాం. ప్రజలు కూడా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
–డాక్టర్ స్పందన, జిల్లా మలేరియా నివారణ అధికారి

ఏరియా ఆస్పత్రిలో కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేశ్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కాంట్రాక్ట్ కార్మికులు మంగళవారం మెరుపు సమ్మెకు దిగారు. శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ తదితర విభాగాల్లోని కార్మికులు నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదంటూ విధులు బహిష్కరించి ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేశ్ మాట్లాడుతూ భద్రాచలం ఏరియా ఆస్పత్రికి నాలుగు రాష్ట్రాల ప్రజలు వస్తుండగా వారికి సేవలందిస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం గర్హనీయమన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వెంకట్రావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో సమ్మెకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి కార్మికుల ఖాతాల్లో వేతనం జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎంబీ నర్సారెడ్డి, బి.శరత్‌బాబు, వైవీ రామారావు, పి.సంతోష్, నాగరాజు, జి.లక్ష్మణ్, అప్పారి రాము, రమాదేవి, వరలక్ష్మి, రమణమ్మ, నరసింహారావు, రమేశ్, నాగరాజు, నిర్మల, భాస్కర్, గీత, నరేందర్, మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

- ఘటనాస్థలి నుంచి తప్పించుకున్న మావోయిస్టులు
- రూ.38 లక్షల నగదు, మందుగుండు సామగ్రి స్వాధీనం
- కరెన్సీలో రద్దయిన రూ.2 వేల నోట్లు కూడా..



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, మందుగుండు సామగ్రి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని గరియాబంద్ జిల్లాలో మంగళవారం పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరగగా ఘటనాస్థలి నుంచి మావోయిస్టులు తప్పించుకుని పారిపోయారు. దీంతో అక్కడ తనిఖీలు చేపట్టిన బలగాలు పెద్ద ఎత్తున నగదు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతరి – గరియాబంద్ జిల్లాల సరిహద్దుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో గరియాబంద్ జిల్లాలోని శోభా పోలీస్‌స్టేషన్ పరిధి అటవీ ప్రాంతంలో పోలీసు బలగాలకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు మొదలు పెట్టగా పోలీసులు సైతం ఎదురుకాల్పులకు దిగారు. అనంతరం మావోయిస్టులు తప్పించుకోగా అక్కడ భూమిలో పాతిపెట్టిన డంప్ లభ్యమైంది. వెలికితీయగా రూ.38 లక్షల నగదు, భారీగా మందుగుండు సామగ్రి, విప్లవ సాహిత్యం, మందులు ఉండగా స్వాధీనం చేసుకున్నారు. కాగా, నగదులో గతంలో రద్దయిన రూ.2 వేల నోట్లే సుమారు రూ.10 లక్షల మేర ఉన్నట్లు తెలిసింది. అయితే ఎదురుకాల్పుల నుంచి తప్పించుకుపోయిన మావోల కోసం కూంబింగ్ ముమ్మరం చేశారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

- మూడు కేజీల గంజాయి స్వాధీనం
- ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు



గంజాయితో ఎస్‌ఐ మేడా ప్రసాద్, సిబ్బంది

మణుగూరుటౌన్: మండలంలోని ఓ కూడలి వద్ద గంజాయి సేవించడంతో విక్రయిస్తున్న ఆరుగురు వ్యక్తులను మంగళవారం సాయంత్రం మణుగూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ సతీశ్ కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని కూనవరం రైల్వేగేట్ సమీపంలో కూనవరం పంచాయతీకి చెందిన కోరం శేషు, ఏనిక కామరాజు, నూప రామకృష్ణ, ఏనిక తేజవర్ధన్, వాజిద్, జూపల్లి యోగేందర్ అనుమానాస్పదంగా ప్రవర్తిస్తూ మోటార్ సైకిళ్లపై గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న క్రమంలో పెట్రోలింగ్‌లో ఉన్న ఎస్‌ఐ మేడ ప్రసాద్ వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. అప్పటికే గంజాయి సేవించి ఉన్నట్లు మూత్ర పరీక్ష ద్వారా నిర్ధారణ అయిందన్నారు. ఎగువ సిలేరు ప్రాంతానికి చెందిన భగవాన్ హంతల్ నుంచి కొద్ది రోజుల కిందట గంజాయి కొనుగోలు చేసి తాగుతూ మిత్రులకు, స్కూల్, కాలేజీల వద్ద విక్రయాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. వీరి నుంచి మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తనిఖీల్లో సిబ్బంది వసంత్, సత్యనారాయణ, ఆదినారాయణ, రవీందర్ పాల్గొన్నారని తెలిపారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని తిమ్మక్కపేటకు చెందిన వ్యక్తి చేపల వేటకు వెళ్లి మంగళవారం చెరువులో మృతదేహమై తేలాడు. గ్రామానికి చెందిన వెగ్గళం నర్సయ్యాచారి(50) ఖమ్మంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 11న ఉదయం చేపల వేటకు గ్రామంలోని తీగల చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడ చెరువు బురదలో దిగబడి మృతి చెందగా, మంగళవారం ఉదయం ఆయన మృతదేహాన్ని గుర్తించారు. నర్సయ్యాచారికి భార్య, కుమారుడు ఉండగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బంగ్లాకు చెందిన సూరబోయిన రఘుపతి(50) తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన మంగళవారం మరిపెడ వెళ్లేందుకు బయలుదేరి ఇంకొకరి బైక్‌పై లిఫ్ట్ అడిగి మేకలతండా స్టేజీ వద్ద దిగి.. అక్కడినుంచి నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి ఖమ్మంకు చెందిన భక్తులు మంగళవారం విరాళం అందించారు. మామిళ్లగూడెంనకు చెందిన ఊటుకూరు శ్రీనివాసరావు రూ.1,00,116ను ఆలయ అధికారులకు అందజేసి స్వామిని దర్శించుకున్నారు. అలాగే, హైదరాబాద్ కస్టమ్స్ కమిషనరేట్ ప్రిన్సిపల్ కమిషనర్, ఐఆర్ఎస్ అధికారి డీపీ నాయుడు కూడా స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం పండితులు వేదాశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ రమాదేవి, ఉద్యోగులు కత్తి శ్రీనివాస్, లింగాల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు రామాలయ ఆవరణలోని షాపుల వేలం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి ఆలయ ఆవరణలోని షాపులు కేటాయించేందుకు బుధవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ బి.రమాదేవి తెలిపారు. ఆలయ ఆవరణలో ఫొటో తీయడం, ఫోన్లు భద్రపరిచే షాపే కాక చెక్క బొమ్మలు, పూల విక్రయం, ఫ్యాన్సీ షాపుల నిర్వహణ కోసం తానీషా కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 11 గంటలకు వేలం మొదలవుతుందని పేర్కొన్నారు. గతంలో ఆలయానికి బాకీ పడిన వారు, పోలీసు కేసులు ఉన్నవారు వేలం పాటలో పాల్గొనటానికి అనర్హులని వెల్లడించారు.

పెళ్లికి నిరాకరించిన యువకుడిపై కేసు

కొత్తగూడెంటౌన్: ఓ మహిళతో సహజీవనం చేసి.. పాప పుట్టాక పెళ్లికి నిరాకరించిన ఓ యువకుడిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. చుంచుపల్లి మండలం బాదావత్ తండా ఎన్‌కేనగర్‌కు చెందిన పవన్.. పెళ్లి అయి భర్తకు దూరంగా ఉంటున్న మహిళతో ఏడాది కాలంగా సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో మహిళ పాపకు జన్మనివ్వడంతో పెళ్లి చేసుకోమని పవన్‌పై ఒత్తిడి తెచ్చింది. అతడు నిరాకరించడంతో.. బాధితురాలు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించగా వారు సదరు యువకుడిపై కేసు నమోదు చేశారు.

పాము కాటుతో మహిళ మృతి

దమ్మపేట: పాము కాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నల్లివారిగూడేనికి చెందిన కుంటా పోలమ్మ (60) గత నెల 30న తన మేకలను గ్రామ శివారులోకి తోలుకుని వెళ్లింది. ఈ క్రమంలో ఆమెను పాము కాటు వేయడంతో కుటుంబ సభ్యులు ప్రాథమిక చికిత్స చేయించిన అనంతరం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

పావురాల గూడులో నాగుపాము



బంధించిన పాముతో రామకృష్ణ

మధిర: మధిర ఎస్సీ కాలనీలోని ఓ ఇంట్లో ఏర్పాటుచేసిన పావురాల గూడులో మంగళవారం నాగుపాము కనిపించింది. అప్పటికే పాము నాలుగు పావురాలు, రెండు కోళ్లను కాటేయడంతో అవి మృతి చెందాయి. స్థానికులు ఈ విషయాన్ని గుర్తించి ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకుడు దోర్నాల రామకృష్ణకు సమాచారం ఇవ్వగా ఆయన చేరుకుని పామును బంధించి అడవిలో వదిలేశాడు. నిత్యం చిన్న పిల్లలు ఆడుకునే ప్రాంతంలోకి సర్పం రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.

తహసీల్‌లో పాము కలకలం

ఏన్కూరు: ఏన్కూరు తహసీల్ కార్యాలయంలో మంగళవారం త్రాచుపాము కలకలం సృష్టించింది. తహసీల్దార్ చాంబర్ ఎదురు గదిలో పాము కనిపించడంతో ఉద్యోగులు ఆందోళన చెందారు. అయితే, కాసేపు పాము అక్కడే తచ్చాడి ఆ తర్వాత వెళ్లిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ



కొత్తగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

చుంచుపల్లి: హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యాన మంగళవారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. మున్నేరు బ్రిడ్జి నుంచి పోస్టాఫీస్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు విద్యార్థులు జాతీయ జెండాలు చేబూని పాల్గొన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద సామూహిక జాతీయ గీతాలాపన చేసి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగాకిరణ్ మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్వాతంత్య్రం కోసం పోరాడి అమరులైన వారిని స్మరించుకునేలా ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అలాగే, 15న ప్రతిఒక్కరు ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుంజా ధర్మ, ముస్కు శ్రీనివాసరెడ్డి, తాటిపాముల ఐలయ్య, నోముల రమేశ్, భైరి నిర్మల, ఆవుల సుబ్బారావు, గొడుగు శ్రీధర్, గాంధీ, రాపాక రమేశ్, సాయికిరణ్, కటికల రంజిత్, గుమలాపురం సత్యనారాయణ, సాంబ తదితరులు పాల్గొన్నారు.

లేత గెలలు అశ్వారావుపేట ఫ్యాక్టరీకే..



మాట్లాడుతున్న రామచంద్రప్రసాద్

అశ్వారావుపేటరూరల్: వివిధ జిల్లాల నుంచి తరలిస్తున్న లేత పామాయిల్ గెలలను అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీకే తరలించాలని ఆయిల్‌ఫెడ్ అడ్వైజరీ కమిటీ సభ్యులు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని నారంవారిగూడెంలో ఆయిల్‌ఫెడ్ డివిజన్ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన మాట్లాడారు. వివిధ జిల్లాల నుంచి వస్తున్న గెలలన్నీ లేతవి కావడంతో అప్పారావుపేట ఫ్యాక్టరీలో క్రషింగ్ చేస్తే నూనె శాతం తగ్గే అవకాశముందన్నారు. ఈ విషయాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా లేత గెలలను అశ్వారావుపేట ఫ్యాక్టరీకి, ముదురు తోటల ద్వారా వచ్చే గెలలను దమ్మపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీకి తరలించేలా ఆదేశించారని చెప్పారు. ఈ మేరకు సాగు, దిగుబడి, నూనె శాతంపై రైతులు ఆందోళన చెందొద్దని కోరారు. కాగా, ఇతర జిల్లాల నుంచి గెలలను రవాణా చేస్తున్న ప్రైవేట్ ఫ్యాక్టరీలకు రవాణా చార్జీలను ఆయిల్‌ఫెడ్ చెల్లించదని స్పష్టం చేశారు. సమావేశంలో మొగళ్లపు చెన్నకేశవరావు, కోటగిరి సీతారామస్వామి, కేవీ సత్యనారాయణ, బండి భాస్కర్, శీమకుర్తి వెంకటేశ్వరరావు, ఎస్కే పాషా, బూషి పాండు, బాలయ్య, పాలవలస జీవన్‌రావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత



మొక్కలు నాటుతున్న ఆర్‌బీఐ అధికారులు

భద్రాచలంటౌన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన భద్రాచలంలోని ప్రభుత్వ గిరిజన ఉపాధ్యాయ కళాశాలలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ కమల్ ప్రసాద్ పట్నాయక్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు దేశ భవిష్యత్‌కు మూల స్తంభాలని, వీరికి ఆర్థిక వ్యవహారాల్లో అవగాహన ఉంటే విద్యార్థులను సైతం అప్రమత్తం చేస్తారని తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ అనుమతి పొందిన బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో మాత్రమే ఆర్థిక వ్యవహారాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం పలు పుస్తకాలను కళాశాల లైబ్రరీకి అందజేయడమేకాక ఆర్‌బీఐ 90 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మొక్కలు నాటారు. ఆర్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ జగదీశ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీరానాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంరెడ్డి, రిజర్వ్ బ్యాంక్ మేనేజర్లు పృథ్వీ, అలీ తదితరులు పాల్గొన్నారు.

బీమాను సద్వినియోగం చేసుకోండి



నామినీకి చెక్కు అందజేస్తున్న అధికారులు

కల్లూరు: పోస్టాఫీస్‌ల్లో తక్కువ ప్రీమియంతో అందుబాటులో ఉన్న బీమాను అందరూ వినియోగించుకోవాలని ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి సూచించారు. లంకపల్లికి చెందిన రాచూరి శ్రీనివాసరావు తపాలా శాఖ ద్వారా బీమా తీసుకోగా ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి మంగళవారం రూ.10 లక్షల చెక్కును సూపరింటెండెంట్ వీరభద్రస్వామి, ఐపీబీపీ జిల్లా మేనేజర్ రాజేశ్ కల్లూరు పోస్టాఫీస్‌లో అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 60 వేల మంది బీమా చేయించుకోగా ప్రమాదవశాత్తు మరణించిన 23 మందికి పరిహారం అందిందని తెలిపారు. ఏటా రూ.320ప్రీమియంతో రూ.5లక్షలు, రూ.520తో రూ.10లక్షలు, రూ.755 తో రూ.15లక్ష బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈసమావేశంలో ఉద్యోగులు ఖమ్మంపాటి రాజా, ఎం.రామకృష్ణ, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ములకలపల్లి: బైక్‌ను వెనుక నుంచి ఓ వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కంపగూడెం గ్రాస్‌రోడ్డు సమీపంలో మంగళవారం రాత్రి బైక్‌ను వెనుక నుంచి వాహనం ఢీకొట్టింది. ద్విచక్రవాహనంపై ఉన్న ఆర్లపెంట గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపడగా వారిని పాల్వంచ ఏరియాస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

11 నెలల చిన్నారికి డెంగీ

సుజాతనగర్: మండల కేంద్రంలోని 11 నెలల చిన్నారికి డెంగీ నిర్ధారణ అయింది. సదరు చిన్నారి జ్వరంతో బాధపడుతుండగా కొత్తగూడెంలోని మాతా శిశు సంరక్షణా కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు డెంగీగా నిర్ధారించారని మండల వైద్యాధికారి రమేశ్ మంగళవారం తెలిపారు. ప్రజలు పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడమే కాక రెండు, మూడు రోజులు జ్వరం తగ్గకపోతే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.